అలా నిలబడివుండే ఒక్కొక్కప్పుడు కునికిపాట్లు పడుతూంటుంది కూడాను-ఆ కునికిపాట్లలోనే స్వప్నవీధికి ఎగబ్రాకుతుంది. ఆ ఎగబ్రాకటంలో ఆమెయొక్క వెనకటి 'తీర్థపు' రోజులు ఆమె కళ్ళ ముందర మెరిసిపోతాయి.

మెలుకువ వచ్చాక మళ్ళీ కళ్ళు విప్పి చూసుకుంటుంది. 'ఆనాటి' సరంజాంలోది ఒక్క చీర తప్ప మరేమీ మిగలదు. అంతా అదృశ్యమై పోతుంది. మళ్ళా కళ్లు వప్పగించి అలా చూస్తూవుంటుంది, తన చుట్టురావుండే ప్రపంచాన్ని.

మీ రెప్పుడైనా చూశారో లేదో-కోటిపల్లి తీర్థం అయిపోయిన కొన్నాళ్ళవరకూ కూడా ఒక్కొక్క పాక ఇంకా మిగిలివుంటుంది. బొమ్మలనన్నిటినీ సొమ్ముచేసుకున్న ముచ్చి ఆ పాకను విప్పడం దండుగని చెప్పి దాన్నక్కడ విడిచేసిపోతాడు. వెతకడానికి ఓపికవుంటే, ఆపాకలో ఏమూలనో అతడు విడిచివెళ్ళిన ఒకరంగు రాలిపోయిన బొమ్మకూడా కనబడుతుంది. ఆ బొమ్మ అలా చూస్తూ నించోవడంతప్ప మరేంచేస్తుందీ ? ? ?

---

## హక్కులూ, హద్దులూ...

'మీరు మీచేతిని జాపుతే అది ఎక్కడైతే అంతమవుతుందో అక్కడ ప్రక్కవాడి ముక్కు ప్రారంభమవుతుంది మీరు మీ చేతిని జాపడంలో ప్రదర్శించే హక్కువంటిదే ప్రక్కవాడి ముక్కుకు కూడా వుంటుంది. ఈ సత్యాన్ని మీరు గ్రహించి మీ సరిహద్దులలో మీ చేతిని యథేచ్ఛగా సంచరింపనిస్తూ ప్రక్కవాడి ముక్కునుకూడా దాని సరిహద్దులలో దాన్ని స్వేచ్ఛగా ప్రవర్తింపనివ్వాలి. ఇందుకు మీరు ఏవిధమైన ఆక్షేపణ, అభ్యంతరం చూపకూడదు. ఇలాచేస్తే మీచేతికీ వాడి ముక్కుకూ మధ్య ఏవిధమైన ప్రతిష్టంభనా ఏర్పడకుండా పరిస్థితులు సజావుగా సాగుతాయి...'

ఇది ఒకానొక పూర్వకాలపు న్యాయశాస్త్రంలోంచి సంగ్రహించాను. వ్యక్తుల హక్కులనుగురించీ, ప్రవర్తన విధులనుగురించీ ఇంత సులభగ్రాహ్యంగా, చమత్కారంగా బోధనచేసే విధానాన్ని మరెక్కడా నేను చూడలేదు.

నిజానికి న్యాయమంతా, న్యాయశాస్త్రాలన్నీ, న్యాయస్థానాలన్నీ ఈ సూత్రంపైనే ఆధారపడి వున్నాయి. కాని, న్యాయమంటే, వ్యక్తి ధర్మమంటే ఏమిటో ఇంత సులువుగా, అరటిపండు వొలిచి చేతులో పెట్టినట్టుగా తెలుస్తూంటే ఈ హద్దుమీరి నడవడాలూ, హక్కుల మతలబులూ, న్యాయస్థానపు హడావుళ్లూ, దేశాలు దేశాలను మింగడం ఇవన్నీ చావకుండా ఇంకా ఎందుకు బ్రతికి వున్నాయా అని సందేహం కలక్కపోదు ప్రతివారికీ.

దీనికి సమాధానం-నూటియైన సమాధానం ఒక్కటేవుంది-మనం చెయ్యి జాపడం అంతమైనచోట ప్రక్కవాడి ముక్కు ప్రారంభం కావడం మనకు ఇష్టంలేక పోవడమే!

నిజానికి ఎవరుమటుకు వొప్పుకుంటారు అంత సమీపంలోనే మరొకడి వెధవ ముక్కు మొలిచి కూచుంటానంటే ?

నామటుకు నేను వప్పుకోను, మా ఇంట్లోవాళ్లు వప్పరు, మా పిల్లలు అసలే కొట్టొస్తారు. నామాటే ఎందుకు, నేను ఎరిగివున్నంతమటుకు అంతాకూడా ఎవరిమటుకు వారు అన్నిజాతులవారూ తమచెయ్యి అంతమయ్యేచోట మరొకడి ముక్కు మొలవడానికి వప్పుకోరు. మొలిస్తే దాన్ని మొత్తుతారు, హతమారుస్తారు, కాలుస్తారు......

ఇంకా ఒక పక్షానికి నా చెయ్యి అంతమైనచోట ఏ గులాబీయో పూసినా, ఏ మామిడిపండో పండినా నేను సహించగలను. మీరూ సహించగలరు. కాని, బాబోయ్, ప్రక్కవాడి ముక్కే...చాలు లెండి...!

ఎక్కడో ఒకరిద్దరు మహనీయులు, పురాణపురుషులు వుండొచ్చు తమ ప్రక్కగా మరొకడి ముక్కు మొలవడానికీ, వృద్ధి అవడానికీ ఆక్షేపణ చూపనివారు! కాని, జనసామాన్యమంతా అటువంటి మహ

నీయుని నీతిని అలవర్చుకుని బ్రతకాలంటే...మనం మనుషులం, దేవతలం కాము!

నిజానికి మనంకూడా పెద్దపెద్ద కబుర్లు చెప్పేవాళ్ళమే ప్రక్కవాడి ముక్కుకుగల హక్కునుగురించీ, మనచేతి స్వేచ్ఛకుగల హద్దులను గురించీ. కాని, ఇవన్నీకూడా మనచేతి స్వేచ్ఛ ఎక్కడ నశిస్తుందోనని మనం చెప్పే పామేదా కబుర్లు మాత్రమే. నిజానికి ప్రక్కవాడి ముక్కు మన చెయ్యి అంతమయిన చోటనే బ్రతకగలుగుతూ వుండటానికిగల కారణం మన చేతికిగల సహనభావమూ కాదు; మన ఔదార్యమూ, హృదయవైశాల్యమూ అంతకన్నా కాదు. మనకుకూడా ఒకముక్కూ, ప్రక్కవాడికికూడా ఒక చెయ్యి వుండటమే!

ఈ పరిస్థితిని కాదనండి-ప్రక్కవాడికి మీకు మల్లే చెయ్యిలేకండా ఒక్క ముక్కుమాత్రమే వుండనీయండి. మీరు మీచేతినిజాపి-ఇంకా జాపి-దాన్ని ఆ ముక్కును త్రుంపివేయడానికి వెనుదీయరు! ఇది సహజం!

ఇప్పుడుకూడా ప్రక్కవాడి ముక్కును మీరు వూడదీయలేక పోయినా దాన్ని వూడబీకుదామనే కోర్కమాత్రం మీలో ఏకోశం లోనో దాక్కుని వుంటుంది. పరిస్థితులూ, పోలీసువాళ్లు, సైన్యాలూ, న్యాయస్థానాలూ, మీకోర్కను అలా తాత్కాలికంగా అణచివుంచా యంతే అంతర్గతంగా! అవకాశం వచ్చిందంటే మీ చెయ్యి వాడి ముక్కుమీదికే దూసుకు వెడుతుంది. కాని మీ ముక్కును చూస్తే కూడా వాడి చేతికి అటువంటి స్వభావమే వుంటుందని మీకు బాగా తెలుసును! అందుకనే మీరు మీ నైజాన్ని కప్పిపుచ్చుకుందుకు ప్రయత్నిస్తూ, ఈ ప్రజాస్వామికపు పెద్ద కబుర్లన్నీ చెబుతారు.

హిట్లరుకూ ముసోలినీకీ వచ్చిన అవకాశాలు అందరికీ వస్తాయా మరీ? అటువంటి అవకాశాలను పొందలేనివారంతా ఈ ప్రజాస్వామికపు మేకతోళ్ళు ధరించినా వాటి అడుగున దాగివున్న పులి స్వభావాన్ని మనం గుర్తించపలేక పోము!